ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు
సచిత్రాంధ్ర మాసపత్రిక.

స్థాపితము ౧౯౩౩.
సాలుచందా 1-8-0.
సంపాదకుడు :
ఆంధ్ర శేషగిరిరావు, బి.ఏ.

సంపుట : ౫. ధాతు, మార్గశిరము : డిశంబరు, 1936. సంచిక : ౫.

# ఆత్మసంస్కారము

## కవికొండల వెంకటరావు

"ఇప్పటికో మడతమంచం మనం సంపాయించుకోగలిగాం!" అని అంటూవుంది ఓఅమ్మి తనముందు కోతినెట్టుకుని. అలా అంటూవుంటే—పెంపుడుకోతి అది, బిచ్చగాండ్రకోతి అది,—ఊరికే ఆమడతమంచం మీదికెక్కి పిల్లిమంత్రాలేస్తూ కిందకు దిగుతూ వినోదంకలిగిస్తూవుందా అమ్మికి.

అనతిదూరంలోనే గోదావరీస్రవంతి ప్రవహిస్తూవుంది క్రొందేటనీటితో. సంధ్యారాగసుకాంతి యెఱ్ఱనిరంగుతో పశ్చిమాకాశవీథిని అలముకుంటూ వున్నప్పటికిన్నీ, శీతాకాల ప్పొద్దవడంవల్ల చాకలివాళ్ళు బట్టలింకా బాగా ఆరలేదనుకుంటూ చాకిరేవుసందడినే యున్నారు. తీరసమప్రదేశాన్ని తాత్కాలికంగా కర్రలు పాతి అమర్చుకొన్న తాళ్లదండాలను ఎర్రవి, నల్లవి, ఆకుపచ్చవి, తెల్లవి, నీలానివి, గులాబీవి, కాఫీవి, పసుప్పచ్చవి,—ఎన్నిరంగులు ప్రపంచంలోవుండాళ్లో అన్నిరంగులయుడుపులు, పంచెలు, చీరలు, పంట్లాములు, కోట్లు, కమీజులు, కబ్బాలు, నిక్కర్లు, చొక్కాలు, జంపర్లు, జాకెట్లు, లంగాలు, లుంగీలు, దుప్పట్లు, గలేబులు, పరికిణీలు, వోణీలు, గోచీలు, గోణాలు, బనియన్లు, బాడీసులు లక్షోపలక్షలుగా గాలికారుతూ వున్నాయి.

"ఇఖ మనకేంగావాలి?" అని అడిగింది ఆఅమ్మి ఆకోతిని. తనలో తానే జవాబుగా అనుకుంది ఆఅమ్మి "శీతకాలమొచ్చింది కాబట్టి ఓజుబ్బా నీకూ, ఓకబ్బా నాకూను. రేపడుక్కుందాం! ఏతల్లైనా యివ్వకపోద్దా?" అని ఆఅమ్మి అలా అనుకుంటూవుంది. కోతి వూరికే పిల్లిమంత్రాలేసేస్తూవుంది మడతమంచంమీద. కొంతసేపటికా అమ్మి కేంతోచిందో "తిమ్మన్నా! మడతమంచం ఆలా తొక్కెయ్యడానిక్కాదు. దిగు" అని దాన్నిదింపి ఆమంచం కోటికట్టి

పారేసింది. కాస్సేపుగింజుకుని కోతి కిందే తొంగుడుండిపోయిం దుత్తి నేలమీదనే. ఆలమ్మి అలా, మంచంమీద కోతిలేకపోయినా, కోతి పిల్లి మంత్రాలేయకపోయినా, ఇంకా ఆమడతమంచంకేసే చూస్తూవుంది.

మసకమసకగా చీకటికమ్ముకొస్తూవుంది. చాకలివాళ్లు బట్టలు మడతలెట్టుకుని మూటలు కట్టుకుని నెత్తికెత్తుకుని యిళ్ళకుపోతూ అనుకుంటూవున్నారు "సుబ్బక్క యీవేళ మడత మంచం సంపాదించిం"దని.

"ఏమిట్రా సుబ్బక్క మడతమంచంసంపాదించడంలోని విశేషం? మడతమంచం సంపాదించటమనేది అంతగొప్పపనిట్రా!" అని అడిగితే వాళ్ళన్నారూ—"కాదుటండీ, జబ్బలడిపోయీటట్టు తెల్లాఅగట్లనుంచి యిర్యేల దాకా బట్లే మేం మేమే బట్లన్నట్టు బాదుకుంటేనేగాని చేరెడునూకలూ రావుగదా మాకు, దానికిచూడండి రోజూ కుంచెడుబియ్యం దొరకడమేకాకుండా యీయేల మడతమంచం దొరికింది. చేసేపని పట్నంలో కోతినాడించడం" అని అనుకుంటూపోయినారు.

సుబ్బక్క పక్కున నవ్వుతూ అంటించింది మాటొకటి ఆ చాకలాళ్ళను. "ఏంట్రా! నన్నుగురించే అనుకుంటూవున్నారు? మీకప్పుడే కడుపుబ్బుతూందట్రా! కోతికి జుబ్బాలేదు, నాకు కబ్బాలేదు. చలేసుకొస్తూవుంది. ఒరేవ్ పోతిగా! ఓరి చాకలిపోతిగా! ఓదుప్పటీ ఇలాపారేసిపోదూ నీకు పున్నెముంటుంది. రేపిస్తాను మళ్లీని;" అని అడిగింది.—పోతిగాడన్న చాకలి కొంచెం వెనక్కుతిరిగి సుబ్బక్కనుచూచి "దుప్పటీ కావాలేం? నీకు? దుప్పటీ?" అంటూ చక్కాపోయినాడు.

క్షణికంలో గోదావరీతీరమంతా నిర్మానుష్యమైపోయింది. సుబ్బక్క వొక్కర్తే వుందక్కడ. వొక్కర్తేయేం లేండి; కోతీవుంది. కోతీ తానూ కలిసి ఆనాడు సంపాదించుకున్న మడతమంచంవుంది. ఉండేంలాభం అవి? దీపంలేదు! దివిటీలేదు. చలేసుకొస్తూవుంది గడ్డిమొక్కకూడాను.

ఆ చల్లో సుబ్బక్క తానానాడు సంపాదించుకున్న మడతమంచం ఎక్కికూర్చుని ఆలోచిస్తూవుంది. దేన్నిగురించి అంటే—ఆరోజుమధ్యాహ్నం పట్నంమధ్యనున్న ఆంజనేయస్వామిగుడిముం దొకపిధ్వజంతోకూడిన ఎత్తయిన ఆకాశదీపస్తంభం నెలకొల్పబడింది. ఆ స్తంభంయొక్క యెత్తునుగురించీ, దానిచివర అల్లాడిన ఆంజనేయస్వామివారి జండానుగురించీ ఆలమ్మి అట్టే ఆలోచించడం ప్రారంభించింది. అలా ఆలోచించడం ప్రారంభించి ప్రారంభించి నిద్రపట్టక కళ్లు ఆతట్టుకు తిప్పింది. తానేజండానుగురించి ఆలోచిస్తూవుందో ఆజండాచెంత మినుకుమినుకుమంటూ చిన్నదీపం ముత్తేమంత వెలుగుతూవుండడం కనుక్కుంది.

"ఇప్పటికి చూడగలిగాను, ఇన్నాళ్ళకిక్కణ్ణుంచియో వెలుగు; ఇప్పటికి చూడగలిగాను" అని అనుకుంది.

మంచంమీద కోతీచూచింది ఆవెలుగు, కోతి కిచకిచమంటూ అందికదా మనుష్యకంఠంతో—"సజీవంతోవున్న నాచుట్టూ చీకటిగావుంటే, ఎవరక్కడికి ఎక్కించుకుపోయినారు? నిర్జీవమైన ఆకాశంలోకి ఆ దీపాన్ని?" అని అడిగింది.

"అదీ నీలాగాడే జండావే! దానిదగ్గఱ వెలుగుతూవుందాదీపం! ఊరుకో ఆశ్లేపే

లకు" అంది సుబ్బక్క.

"ఎవరాడిస్తున్నారు దాన్ని?" అని ప్రశ్న.

"మనిషే, దాన్ని నాలాంటిమనిషే" అని జవాబు.

"అందఱూ మనుష్యులే, అందఱూ కోతులే!" అంటూ చాకలిపోతిగాడు వచ్చేడు, పెద్ద మాసిపోయిన బట్టలమూటా వాడూ తూర్పింకా తెల్లారకుండానే.

సుబ్బక్క అంటుంది "పోతిగా! మడత మంచంమీదగానీ కూకునేవుగనక! ఇప్పటికి సంపాదించుకోగలిగాం ఓ మడతమంచం!"

పోతిగాడు :— ఎవరెవరు సంపాదించుకున్నా రీమడతమంచం? సుబ్బక్కా!

సుబ్బక్క :— "నేనూ, నాకోతీని" అంటూ అడిగింది పోతిగాణ్ణి— "ఆకాశదీపం ఆంజనేయునిగుడిముందీరేత్రి కొత్తగా వెలిగించింది చూచావా?" అని.

పోతిగాడంటాడు. "అన్నీదీపాలే! అన్నీ గుళ్లే!"

సుబ్బక్క అంటుంది. "తెల్లవార్లూ సలేసుకుపోయిందిరో!" అని,

పోతిగాడు :—మఱి దీపంసూశానంటున్నావు? దీపంసూశాక్కూడా సలే?

సుబ్బక్క :—సలి సలే! దీపం దీపమే! ఏమంటావు?

పోతిగాడు :—నీవేదాంతం నాకు తెలదు. తెల్లారి కోతీ నిన్నూ పోతారు. మాపటికి కుంచెడుబియ్యం తెచ్చుకుని యీ మడత మంచంమీదకూచుని ఏరుకుంటూ కూర్చుంటారు. మీదే అదృష్టం!

సుబ్బక్క :—పోతన్నా! నాకోకబ్బా నాకోతికోజుబ్బా యీయేల దొరికితే మరేం వొద్దు.

పోతన్న :—దొరుకుద్ది. [అని పోతాడు పోతన్న]

సుబ్బక్క :—"ఇప్పటి కోమడతమంచం వచ్చిందా మనకు! తిమ్మన్నా! ఇఖ నీకో జుబ్బా నాకోకబ్బా! లెగు! తిమ్మన్నా!" అంటూ తిమ్మన్నను. లేవగొట్టుకు సుబ్బక్క ముష్టికి పట్నమమ్మట బయల్దేఱింది.

* * *

నాడు పట్నమంతా సుబ్బక్క ముఖంలో కొత్తవెలుగు చూచేరు. "సుబ్బక్కా! యీ వేళ బాగున్నావు!" అని అంతాఅంటే సుబ్బక్క అంది "ఉన్నానుకమోసు—తల్లుల్లారా! తండ్రుల్లారా! ఇన్నాళ్ళమల్లే కడచిన మాపు నేలమీదచెమ్మలో తొంగుడుండలేదు నేను. మీదయవల్లా మీదయవల్లా ఓ మడతమంచం నిన్న సంపాదించుకుని అందుమీద తొంగుడుండాను. అందుమూలాన్నికమోసు కాస్తంత జలుబూగిలుబూ వదిలి నేవళీకంగా కనబడుతున్నాను. అయినా చెప్పదగ్గఅందం నాలో ఏముంది? నేచూచిన దీపంలోవుంది!"

అలా అంటూంటే నిజంగా సుబ్బక్క కళ్లు మెఱిసిపోయినాయి. పట్నమంతా సుబ్బక్క ముఖంలో కొత్తవెలుగు చూచేరు.